# చైనాలో వ్యవసాయ సంస్కరణల కాలంలో తలెత్తిన ప్రధాన సమస్యలు

జెన్ లి-పెన్

1948 సం॥ జనవరిలో చైనా ప్రజావిముక్తి సైన్యానికి చెందిన ఫ్రంట్ కమిటీ యొక్క వాయవ్య విభాగపు విస్తృత సమావేశంలో కామ్రేడ్ జెన్-లి-పెన్ ఇచ్చిన నివేదికను ఇక్కడ అందిస్తున్నాం. చైనాలో వ్యవసాయ సంస్కరణల అమలు సందర్భంగా ఎదుర్కొన్న వర్గ విశ్లేషణ, భూస్వామ్యదోపిడీ, మధ్యతరగతి, ధనిక రైతులను కలుపుకోవలసిన ఆవశ్యకత, పోరాట పద్ధతులు వంటి అనేక సమస్యలను ఈ నివేదిక స్పష్టంగా వివరించింది.

శత్రువుకు-ప్రజలకు మధ్య విభజనరేఖను స్పష్టంచేసి, శత్రువును ఏకాకిని చేసి విచ్ఛిన్నంచేయాలని, వర్గ విశ్లేషణలో గందరగోళం, తప్పుడు ప్రాతిపదికలు, తప్పుడు నిర్ధారణలు మనలను ఏకాకులను చేసే ప్రమాదముందని మావో చేసిన హెచ్చరికలను ఈ నివేదికలో వక్కాణించి చెప్పారు. వివిధ ప్రాంతాలలో కమిటీలు చేసిన తప్పులను ఉదాహరణలుగా చెప్పి, ఇలాంటి వాటన్నింటిని సరిచేసుకోవలసిన ఆవశ్యకతను వివరించారు.

పేదరైతులు-వ్యవసాయకూలీలపై ఆధారపడుతూనే మధ్యతరగతి రైతులందరినీ ఐక్యంచేయవలసిన అవసరాన్ని, అందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను తరచుగా దొర్లే పొరపాట్లను పేర్కొనటంతోపాటు భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి, ధనిక రైతుల వ్యతిరేక పోరాటానికి తేడాను చూడాలని పేర్కొన్నారు.

అలానే, నేరస్థులను శారీరకంగా శిక్షించటం లేదా మరణదండన విధించటం వంటి అంశాలలో కమ్యూనిస్టు పార్టీ, కమిటీలు ఎంతటి బాధ్యతాయుతంగా వ్యవహరించాలో, లేకుంటే జరిగే నష్టాల తీవ్రతను ఉదహరించారు.

మనదేశంలో ప్రస్తుతం నెలకొన్న అర్ధఫ్యూడల్ పరిస్థితులను అవగాహన చేసుకోవటానికి, వ్యవసాయ సంస్కరణల ద్వారా ప్రజాస్వామిక విప్లవాన్ని కొనసాగించటానికి ఈ నివేదిక ఈనాటికి కూడా ప్రాధాన్యత కలిగివున్నదిగా పరిగణిస్తూ దీనిని అందిస్తున్నాం. – సంపాదకుడు

**వ్యవసాయ** సంస్కరణలకు సంబంధించిన పలు సమస్యలపై ప్రసంగించడం అవసరమని నేను భావిస్తున్నాను. ఇవి అనేక ప్రధాన సమస్యలు మాత్రమే కాని, వ్యవసాయ సంస్కరణలకు సంబంధించిన మొత్తం సమస్యలు కావు. వివిధ విముక్తి ప్రాంతాల యొక్క వ్యవసాయ సంస్కరణోద్యమం, విస్తారమైన విముక్తి ప్రాంతా లలో మహత్తర విజయాలను సాధించింది. ఇది గొప్ప ప్రజా ఉద్యమాన్ని అభివృద్ధి చేయటమే కాకుండా, వేలకొలది సంవత్సరాలుగా ఉనికిలో ఉన్న భూస్వామ్య, అర్ధ భూస్వామ్య దోపిడీ వ్యవస్థను తుడిచిపెట్టింది. లేదా ప్రస్తుతం సమగ్రంగా తుడిచి పెడుతూ కోట్లాది చైనా రైతాంగం విముక్తి కావడానికి వీలు కల్పించింది. భూస్వామ్య వ్యవస్థను కూలద్రోసి, రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా నూతన ప్రజాతంత్ర వ్యవస్థ స్థాపించబడటాన్ని వర్ణించడానికి విముక్తి ప్రాంతాలలో రైతాంగం ('ఫాన్‌షాన్' అనే పదాన్ని వాడేవారు.) ఇది చైనా చరిత్రలో మహత్తర ప్రజా ఉద్యమం. ఈ పునాది మీదనే యుద్ధం విజయవంతంగా అభివృద్ధి కాగలదు. దీనివలనే సామ్రాజ్యవాదం మరియు కొమింటాంగ్ అభివృద్ధి నిరోధక శక్తులు భీతిల్లుతున్నాయి. గత సం॥ము సెప్టెంబరులో జరిగిన వ్యవసాయ మహాసభ, వ్యవసాయ సంస్కరణలపై మొత్తం చర్చలను నిర్వహించి, అనేక ముఖ్యమైన నిర్ణయాలు చేసింది. వ్యవసాయ మహాసభ నిర్ణయాల ఆధారంగా చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ, చైనా వ్యవసాయ చట్టం యొక్క మౌలిక కార్యక్రమాన్ని రూపొందించి, వివిధ విముక్తి ప్రాంతాల ప్రభుత్వాలు దీనిని అమలుజరపాలని ప్రతిపాదిస్తూ ప్రచురించింది. ఈ ప్రచురణలో మన పార్టీ వ్యవసాయ విధాన మార్గదర్శకాలను, పద్ధతులను స్పష్టంగా, సరిగ్గా దేశ ప్రజలందరి ముందుంచింది. వీటిని మనం నిశ్చయాత్మకంగా బలపరచాలి. అయితే వ్యవసాయ సంస్కరణలు అన్వయించడం, అమలు పరచడం చాలా కష్టతరమైనది, క్లిష్టతరమైనది. రైతాంగం యొక్క ఆచరణాత్మక ఉద్యమ క్రమంలో తలెత్తే వివిధ సమస్యలను సరిగా, నిర్దిష్టంగా పరిష్కరించాల్సిన అవసరం వున్నది.

ఇటీవల కేంద్రకమిటీ చేసిన నిర్ణయాల ఆధారంగా మహత్తర ఉద్యమ క్రమంలో తలెత్తిన సమస్యల గురించి నేను ఇపుడు మాట్లాడతాను. మొత్తం పార్టీ వీటిపై దృష్టి సారించాలి.

### గ్రామీణ వర్గ విభజనకు ప్రాతిపదిక ఏమిటి?

వివిధ ప్రాంతాలలో గ్రామీణ వర్గాలను విభజించడానికి పరిశీలనా డాక్యుమెంట్లుగా – ఇటీవల కేంద్ర కమిటీ 1933 నాటి రెండు డాక్యుమెంట్లను మరలా విడుదల చేసింది. అవి– "వర్గాలను ఎలా విశ్లేషించాలి", మరియు "వ్యవసాయ పోరాటాలలోని కొన్ని సమస్యలపై నిర్ణయం". ఇవి 1933 నాటి డాక్యుమెంట్ల యినప్పటికీ, సాధారణంగా, నేటికీ అన్వయింప దగినవి. భూస్వాములు, ధనిక రైతులు, మధ్యతరగతి రైతులు, పేద రైతులు, వ్యవసాయ కూలీలు మొదలగు వర్గాలకు సంబంధించిన సరైన నిబంధనలు ఈ డాక్యుమెంట్లు కలిగి వున్నాయి. కొన్ని చోట్ల వర్గ విభజనలో తప్పులు జరిగినందున కేంద్ర కమిటీ ఈ డాక్యుమెంట్లను విడుదల చేసింది. చాలా మంది ప్రజల వర్గ స్థాన నిర్ణయంలో తప్పుడు ప్రమాణాలు పాటించ బడనందున శత్రువులకి, ప్రజలకి మధ్య విభజన రేఖ స్పష్టంగా తెలియడం లేదు. శత్రువుకి, ప్రజలకి మధ్య స్పష్టమైన విభజన రేఖను గీయాలని, స్పష్టంగా తేడాలను చెప్పాలని, శత్రువుని ఏకాకిని చేసి, విచ్ఛిన్నం చేయాలని, మరియు మనం ఏకాకులం కాకూడదని ఛైర్మన్ మావో మనకు బోధించారు. చాలా మంది ప్రజల వర్గస్థితి తప్పుగా నిర్ధారించబడితే, అది మన శ్రేణులను తారుమారు చేస్తుంది.

**త్సాయి - చియాయి అంశం**

పైన పేర్కొనబడిన ప్రమాదం యొక్క తీవ్రతను తెలిపేందుకు షాన్సీ-సుయియాన్ ప్రాంతపు ఒక అంశాన్ని ఇప్పుడు ఉదహరిస్తాను. హసింగ్సన్ కౌంటిలోని త్సాయి-చియాయి పరిపాలన గ్రామంలో వర్గాల స్థానం నిర్ధారణలో జరిగిన తప్పులను సరిదిద్దడం గురించి షాన్సి- సుయియాన్ సబ్ బ్యూరో గత నెల మాట్లాడిన ప్రకారం, కుగ్రామమైన చౌర్వాంగ్‌ను మినహాయించి త్సాయి-చియాయి పరిపాలనా గ్రామమంతటిలో మొత్తం 552 కుటుంబాలలో 124 కుటుంబాలు లేదా 22.46 శాతం కుటుంబాలు భూస్వామ్య, ధనిక రైతు కుటుంబాలుగా నిర్ధారింపబడ్డాయి. సాధారణ అంచనాల ప్రకారం, పాత ప్రభుత్వం క్రింద సరాసరి సుమారుగా భూస్వాములు 5 శాతము, భూస్వాములు, ధనిక రైతులు కలిపి, మొత్తం కుటుంబాలలో సరాసరిగా సుమారు 8 శాతం, మొత్తం జనాభాలో 10 శాతంగా వున్నారు. పాత విముక్తి ప్రాంతాలలో చాలా మంది భూస్వాములు, పాత తరహా ధనిక రైతులు ఇప్పటికే ఇతర వర్గాల సభ్యులుగా మారిపోయారు. భూస్వాములు, ధనిక రైతు కుటుంబాల సంఖ్య 8 శాతం కన్నా తక్కువగా ఉండాలి. అయితే త్సాయి-చియాయి గ్రామంలో భూస్వాములు, ధనిక రైతు కుటుంబాల సంఖ్య 8 శాతం దాటి దాదాపు రెండు రెట్లు పెరిగింది.

తరువాత, "వర్గాలను ఎలా విశ్లేషించాలి", "వ్యవసాయ పోరాటాలలో కొన్ని సమస్యలపై నిర్ణయం" అనే రెండు డాక్యుమెంట్లలోని సూత్రాల ఆధారంగా రైతాంగ కాంగ్రెస్ కమిటీ ద్వారా పని చేస్తున్న సబ్ బ్యూరో యొక్క పునర్విచారణ ఫలితంగా, 124 కుటుంబాలలో 11 కుటుంబాలు దివాళా తీసిన, క్షీణిస్తున్న భూస్వామ్య కుటుంబాలుగా, 20 కుటుంబాలు "ఉత్పత్తిలో ఉన్న ధనిక రైతులు"గా మొత్తం 31 కుటుంబాలు పరిగణలోకి తీసుకోబడి, బాగా జరుగుబాటు గల రైతులుగా పునర్ నిర్ణయించారు. ఆ విధంగా భూస్వాముల, ధనిక రైతుల సంఖ్య 93 కుటుంబాలకు, లేదా 16.84 శాతానికి తగ్గింది. తరువాత, నిర్ధారణ కొరకు కాల ప్రమాణం 1937 నుండి 1940కి తగ్గించబడింది. ఆ విధంగా, త్సాయి - చియాయి గ్రామంలోని మొత్తం 579 కుటుంబాలలో(చౌర్వాంగ్‌తో సహా) భూస్వామ్య, ధనిక రైతు కుటుంబాలు 71కి తగ్గించబడగలిగాయి. ఇప్పటికీ ఇది మొత్తం కుటుంబాలలో 12.26 శాతం. 5 సం॥ల నుండి శ్రమలో పాల్గొంటున్న భూస్వామ్య కుటుంబాలను, 3 సం॥ల నుండి దోపిడీకి పాల్పడకుండా మానివేసిన ధనిక రైతు కుటుంబా లను మధ్యతరగతి రైతాంగంగా మనం పరిగణిస్తే భూస్వామ్య, ధనిక రైతు కుటుంబాల సంఖ్య ఇంకా స్వల్పంగా వుంటుంది. హసింగ్సన్ కౌంటీలోని త్సాయి - సియాయి గ్రామాన్ని ఈ ప్రాంతంలో భూస్వాములు, ధనిక రైతులు సాపేక్షంగా కేంద్రీకృతమై ఉన్న ప్రదేశంగా తీసుకోవచ్చు. త్సాయి - చియాయి గ్రామంలో ఉన్నంత ఎక్కువ మంది భూస్వాములు, ధనిక రైతులు ఈ కౌంటీలోని చాలా గ్రామాలలో లేరు. అయితే త్సాయి-చియాయి అనుభవం మనకు బోధిస్తున్న ముఖ్యమైన పాఠం ఏమిటంటే, వాస్తవ పరిస్థితిని అనుసరించి, వర్గాలను విభజించి వ్యవసాయ సంస్కరణలు చేపట్టాలి. భూస్వాములు, ధనిక రైతులు కాని వారిని భూస్వాములుగా, ధనిక రైతులుగా ఏ మాత్రం కృత్రిమంగా విభజించకూడదు. ఆ విధంగా చేస్తే, తప్పుగానే "దాడి ప్రాంతాన్ని" పెంచుకోవడం, విప్లవ ఐక్య సంఘటనను తారుమారు చేసుకోవడం, శత్రువుకు సహాయపడటం, మనల్ని మనం ఏకాకుల్ని చేసుకోవటం జరుగుతుంది. ఇది అత్యంత ముఖ్యమైన సమస్య. పార్టీలోని మొత్తం కామ్రేడ్స్ దీనిపై దృష్టి సారించాలి.

అయితే వ్యవసాయ సంస్కరణలలో హసింగ్సన్ కౌంటీలోని త్సాయి- చియాయిలో పని చేస్తున్న కామ్రేడ్స్ ఎలా వర్గ స్థానాలను తప్పుగా విభజన చేశారు? కింది కారణాల వలన 31 కుటుంబాలు ఎగువ వర్గాలలోకి మార్చబడ్డారని నివేదిక పేర్కొంది. (1)15 కుటుంబాల వారి తల్లిదండ్రులు, తాతలు ప్రజల్ని దోపిడీ చేశారనే కారణంగా వీరు తప్పుగా నిర్ధారింపబడ్డారు. 1937లో గాని, జపాను ప్రభుత్వ వ్యతిరేక ప్రజాస్వామికం ఏర్పాటుకు ముందుగాని లేదా అంతకుముందు గాని ఈ 15 కుటుంబాలు స్వయంగా ఇతరుల్ని దోపిడీ చేయటం చాలా స్వల్పం లేదా అసలు చేయలేదు. (2) మరో 5 కుటుంబాల వారు ఎందుకు తప్పుగా వర్గ విభజన చేయబడ్డారంటే, వీరు తొలి సం॥రంలో భూస్వామ్య ధనిక రైతుల జీవనాన్ని సాగించారు. అయితే జపాన్ వ్యతిరేక యుద్ధానికి ముందు (వారి జీవితంలో చివరి అర్ధభాగం)నుండి వారు శ్రమించారు; ఇతరులను దోపిడీ చేయలేదు; చేసినా అతి స్వల్పం మాత్రమే (3) మరో 7 కుటుంబాలు ఎందుకు తప్పుగా నిర్ధారించబడ్డారంటే వీరికి చాలా ఆస్తులు న్నప్పటికీ, వీరు కష్టించే శ్రామికులు, స్వల్ప దోపిడీకి మాత్రమే పాల్పడ్డారు; (4) ఇంకో 3 కుటుంబాలు ఎందుకు తప్పుగా నిర్ధారింప బడ్డారంటే వీరు ప్రధానంగా స్వయంగా శ్రమ చేస్తున్నప్పటికీ, ఇతరులను స్వల్పంగా దోపిడీ చేశారు లేదా అసలు దోపిడీ చేయలేదు; వీరు వారి తొలి సం॥లలో పేదరికంలో ఉన్నపుడు భూస్వాములు లేదా ధనిక రైతుల వారసులుగా దత్తత తీసుకోబడ్డారు, లేదా అమ్మబడ్డారు. (5)ఒక కుటుంబం(విధవ మరియు అనాథ) ఎందుకు తప్పుగా నిర్ధారింపబడిందంటే శ్రమ చేసే శక్తి లేనందున, ఈ అనాధ కొంతకాలం ఇతరుల్ని కూలికి పెట్టుకొన్నాడు. ఈ అనాధ తండ్రి రైతు; ఇతను కూడా పెద్ద వాడయినపుడు స్వయంగా రైతుగా మారాడు. అకస్మాత్తుగా శ్రమచేసే శక్తి కోల్పోయి, పూర్తికాలం వ్యవసాయ కూలిని పెట్టుకున్నాడు. (6) వీటితో పాటు గతంలో వర్గస్థానాలను నిర్ధారించడంలో, వారి రాజకీయ వైఖరులవల్ల వీరి ఆర్థిక పరిస్థితులు, దోపిడీ బంధాలు నిర్ధారించడం చాలా కష్టంగా ఉండటంతో, వీరిని కింద వర్గం లోకో, ఉన్నత వర్గంలోకో మార్చడం తరచుగా జరుగుతుండేది.

**దోపిడీ మాత్రమే ప్రాతిపదిక**

స్థూలంగా గతంలో త్సాయి-చియాయి, మరియు షాన్సి-సుయియాన్‌లలోని ఇతర భాగాలలో, వర్గస్థానాలను నిర్ధారించడానికి దోపిడి చరిత్ర, జీవనోపాధి మరియు రాజకీయ వైఖరి లాంటి అనేక ప్రమాణాలు ఉపయోగించ బడ్డాయి. వర్గస్థానాన్ని గుర్తించడానికి, దోపిడీని ప్రమాణంగా కాకుండా మరొక స్థితిగతులను ప్రమాణంగా తీసుకోవడం పూర్తిగా తప్పు. ఆ విధంగా ఒక్క

త్సాయి-చియాయి పరిపాలన గ్రామంలోనే 50 కుటుంబాలకు పైగా లేదా సుమారుగా 300 మంది శత్రు శిబిరంలోని వారుగా గుర్తించబడ్డారు. ఇది శత్రువుని ఏకాకిని చేయడం కాకుండా, తమని తాము ఏకాకుల్ని చేసుకోవడమే. మన సొంత శ్రేణులైన ప్రజల్ని శతృశిబిరంలోకి పంపడం ఎంత తీవ్రమైన తప్పిదం?! అంత సంఖ్యలో ప్రజల వర్గస్థానాన్ని తప్పుగా నిర్ధారించడం పట్ల రైతాంగ వైఖరి ఏమిటి? రైతు కాంగ్రెస్ కమిటీ చర్చల సమయంలో వర్గాల్ని విభజించటానికి 1933 నాటి "వర్గాలను ఎలా విశ్లేషించాలి" పద్ధతిని కమిటీ సభ్యులందరూ ఆమోదించారు, కాని సరిదిద్దుకోవడానికి భయపడ్డారని సబ్ బ్యూరో కామ్రేడ్స్ చెప్పారు. చాలా ఎక్కువమంది వర్గ శత్రువులను తేల్చారని పేద రైతులు, వ్యవసాయ కూలీలు భావించారని, కానీ మాట్లాడటానికి సాహసించలేదని కొంతమంది అత్యంత స్పష్టంగా చెప్పారు. భూస్వాములు, ధనిక రైతుల్ని కాపాడుతున్నామని ఇతరులు అనుకుంటారని వారు భయపడ్డారు. వాస్తవంగా మధ్యతరగతి ఉత్పత్తి చేస్తున్న రైతులు అయినప్పటికీ, ధనిక రైతులుగా విభజించబడ్డారనే విషయాన్ని అత్యధిక భాగం కమిటీ సభ్యులు నొక్కి చెప్పారు. సైన్యంలో సేవ చేయకపోవడమనేది తమకు అననుకూలమని వారు చెప్పారు. స్వల్పదోపిడీ చేస్తూ, "ఉత్పత్తి చేస్తున్న ధనిక రైతుల్ని" మధ్యతరగతి రైతులుగా విభజించడం వల్ల, మధ్యతరగతి రైతులు భయపడకుండా ఉత్పత్తి చేయడానికి తోడ్పడటమే కాకుండా, ఉత్పత్తికి ప్రయోజనకరంగా ఉంటుందని కూడా వారు చెప్పారు. పెద్దసంఖ్యలో ప్రజల్ని భూస్వాములుగా, ధనిక రైతులుగా తప్పుగా విభజించడం పట్ల రైతులు సంతృప్తికరంగా లేనట్లు దీని నుండి చూడవచ్చు. ఈ తప్పుడు విభజన శత్రువులను పెంచుతుందని, ఆవిధంగా సొంతబలం తగ్గు తుందని, ఇది ఉత్పత్తిలో అభివృద్ధికి హాని కలుగ చేస్తుందని వారు భావిస్తున్నారు.ఇది విషయాలను పరిశీలించడంలో చాలా సరైన పద్ధతి.

హసింగ్సన్ కౌంటీలో త్సాయి-చియాయిలో వర్గస్థానాన్ని తప్పుగా విభజించడం అనే సమస్యను ఒక ఉదాహరణగా మాత్రమే లేవనెత్తుతున్నానని గుర్తించాలి. త్సాయి - చియాయిలో వర్గస్థానాన్ని తప్పుగా విభజించడం లాంటివి కొంచెం అటు ఇటుగా నైరుతి ప్రాంతంలోని షాన్సి- సుయియాన్‌లోని ఇతర గ్రామాలలో చాలా సంఖ్యలో ఉన్నాయని నిశ్చయాత్మకంగా చెప్పగలము. వ్యవసాయ సంస్కరణల పనిలో ఉన్న నాయకత్వ కామ్రేడ్స్ అందరూ వర్గస్థాన విభజన సమస్యను తీవ్రంగా పరిశీలించి, వాళ్ళు చేసిన తప్పులను బహిరంగంగా, ఖచ్చితంగా సరిదిద్దుకోవాలి. తప్పుగా నిర్ధారింప బడింది ఒక్క వ్యక్తే అయినా తప్పకుండా సరిదిద్దబడాలి.

త్సాయి - చియాయి వర్గస్థాన విభజనలో అనుసరించిన ప్రమాణాలు తప్పు అయితే వర్గ స్థాన నిర్ధారణకు సరైన ప్రమాణాలు ఏమిటి? ఇది మొట్టమొదట స్పష్టం చేయాల్సిన విషయం. వర్గస్థానాన్ని నిర్ణయించడానికి ప్రమాణం ఒకటి మాత్రమే; అది, ఉత్పత్తి సాధనాలతో ప్రజలకున్న వివిధ సంబంధాలను అనుసరించి వివిధ వర్గాలను నిర్ధారించాలి. ఉత్పత్తి సాధనాలు కలిగి వుండటం లేదా లేకపోవడం నుండి ఎంత, ఎన్ని, ఏమి కలిగి వున్నారు, అవి ఎలా వినియోగించబడుతున్నాయి నుండి ఉత్పన్నమైన దోపిడీదారుడు - దోపిడీ చేయబడేవాడు అనే వివిధ సంబంధాలు మాత్రమే వర్గ విభజనకు ప్రాతిపదికగా ఉంటాయి.

**ధనిక, మధ్యతరగతి, పేదవర్గాలు ఎవరు?**

ఉత్పత్తి సాధనాలు ఏవి? ఫ్యాక్టరీలు, యంత్రాలు, ముడిసరుకు, ఇతర పెట్టుబడి- పరిశ్రమల్లో ఉత్పత్తి సాధనాలు. భూమి, దున్నే జంతువులు, వ్యవసాయ పనిముట్లు, ఇళ్లు తదితరాలు వ్యవసాయంలో ఉత్పత్తి సాధనాలు. గ్రామాలలో భూమి, దున్నే జంతువులు, వ్యవసాయ పనిముట్లు, ఇళ్ళు మరియు ఇతర ఉత్పత్తి సాధనాలు కలిగి ఉండటం, లేకపోవడం, ఎంత, ఎన్ని, ఏమి కలిగి ఉన్నారు, అవి ఎలా వినియోగించబడుతున్నాయి? (స్వయంగా దున్నడం, కూలీలను పెట్టుకోవడం ద్వారా, కౌలుకివ్వడం ద్వారా) అనేవాని నుండి ఉత్పన్నమైన దోపిడీదారుడు-దోపిడీ చేయబడే వాడు అనే వివిధ సంబంధాలు మాత్రమే గ్రామీణ వర్గాలను విభజించడానికి ప్రాతిపదికగా ఉంటాయి.

పై ప్రాతిపదిక ఆధారంగా గ్రామీణ ప్రాంతాలలో వివిధ వర్గ స్థానాలను గుర్తించడం చాలా సులభం (ప్రధాన వర్గ స్థానాలు) గ్రామీణ ప్రాంతాలలోని ప్రధాన వర్గ స్థానాలను సాధారణంగా క్రింది విధంగా విభజించవచ్చు.

(1) ఎక్కువ భూమి కలిగి వుండి, స్వయంగా శ్రమ చేయకుండా, ప్రత్యేకంగా రైతాంగం భూమి కౌలు దోపిడీ మీద ఆధారపడి, అదే సమయంలో వడ్డీ వ్యాపారం చేస్తూ, శ్రమ చేయకుండా లాభాలు పొందుతున్న వారు, భూస్వాములు.

(2) ఎక్కువ భూమి, దున్నే జంతువులు, వ్యవసాయ పనిముట్లు కలిగి వుండి, ప్రధాన శ్రమలో స్వయంగా పాల్గొంటూ, అదే సమయంలో వ్యవసాయ కూలీల శ్రమను దోపిడీ చేసేవారు ధనిక రైతులు. చైనా పాత తరహా ధనిక రైతులు బలమైన భూస్వామ్య(ఫ్యూడల్) స్వభావం కలిగి వుంటారు. వీరిలో ఎక్కువ మంది వడ్డీ వ్యాపారం సాగించడం, కొంతభాగం భూమిని కౌలుకివ్వడం కూడా చేస్తారు. ఒకవైపు స్వయంగా శ్రమచేస్తూ రైతుల్లా ఉంటూ, ఇంకోవైపు, భూస్వాముల్లా ఉంటూ భూస్వామ్య, అర్థభూస్వామ్య దోపిడీ సాగిస్తారు.

(3) భూమి, దున్నే పశువులు, వ్యవసాయ పనిముట్లు కలిగి వుండి స్వయంగా శ్రమ చేస్తూ, రైతాంగ దోపిడీకి పాల్పడకుండా, లేదా స్వల్ప రైతాంగ దోపిడీ చేసేవారు మధ్యతరగతి రైతులు.

(4) భూమి, దున్నే పశువులు, వ్యవసాయ పనిముట్లు తదితరాలేవీ లేకుండా వారి సొంత శ్రమశక్తిని అమ్ముకొనేవారు వ్యవసాయ కూలీలు.

సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రధానవర్గ స్థానాలను పైవిధంగా వర్గీకరించాలి. భూమిని కౌలుకి ఇస్తూ, పూర్తికాలం కూలీలను పెట్టుకొనే వారందరూ మినహాయింపు లేకుండా భూస్వాములుగానో, ధనిక రైతులుగానో వ్యవహరించవల్సిందేనా? మినహాయింపులు ఉన్నాయి కూడా. ఉదాహరణకు శ్రమశక్తిని పోగొట్టుకున్న విధవలు, అనాథలు, వికలాంగులు, రోగిష్టుల్లాంటి

వారి కొద్ది భూమిని కౌలు కివ్వడానికి అనుమతించవచ్చు. డాక్టర్లు, ప్రాథమిక స్కూలు టీచర్లు, చిన్న ఉద్యోగుల్లాంటి ఇతరులు వారి ఉద్యోగాలు చేసుకుంటూ, వారి కుటుంబాలు కలిగి వున్న స్వల్ప భూమిని స్వయంగా దున్ను కోలేరు; నిర్వాహణ మాత్రమే చేసుకోగలరు కనుక వారు వారి భూమిని కౌలుకిచ్చినా, దున్నడానికి కూలీలను పెట్టుకొన్నా, వారు భూస్వాములుగా లేదా ధనిక రైతులుగా పరిగణింపబడకూడదు. ఇవే కాకుండా, కొన్ని ఇతర క్లిష్ట పరిస్థితులను వివరంగా ఎత్తి చూపుకోవాలి. ఇక్కడ మాట్లాడే విషయాలు చాలా విలక్షణమైనవి.

ధనిక రైతుల్ని, మధ్యతరగతి రైతుల్ని ఎలా నిర్ణయించాలనేది చాలా జాగ్రత్తగా వ్యవహ రించాల్సిన సమస్య. సాధారణంగా మాట్లాడా లంటే, మధ్యతరగతి రైతులు ఇతరులను దోపిడీ చేయరు. స్వల్ప లేదా అప్రయత్న దోపిడీ చేస్తున్నప్పటికీ వారు మధ్య తరగతి రైతులుగానే పరిగణింపబడాలి. ఈ సమస్య మీద ఇటీవల చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ 1933 కన్నా ఎక్కువ ఉదారమైన విధానాన్ని అవలంబించడానికి నిర్ణయించింది. స్వల్పదోపిడీ (పశువుల్ని, గొర్రెల్ని కాయడానికి కూలీల్ని పెట్టుకోవడం, పాక్షిక కాల కూలీల్ని, లేదా నెలవారీ కూలీల్ని పెట్టుకోవడం, లేదా ఒక పూర్తి కాలపు కూలిని పెట్టుకోవడం లేదా అలాంటివి కూడా; బహు స్వల్ప భూమిని కౌలుకివ్వడం, చిన్న మొత్తాల్ని అప్పుగా ఇవ్వడం) సాగిస్తున్నప్పటికీ, ఈ విధంగా పొందే ఆదాయం, మొత్తం ఆదాయంలో 25 శాతం దాటకుండా ఉన్నవారు మధ్యతరగతి రైతులుగా పరిగణింపబడాలి. 1933 ఒప్పందం ప్రకారం ఇటువంటి దోపిడీ, స్థూల ఆదాయంలో 15 శాతం దాటకూడదన్న పరిమితి కన్నా ఇది ఉదారంగా వుంది. వరుసగా మూడు సం।।రాలు, దోపిడీ ఆదాయం, స్థూల ఆదాయంలో 25 శాతం దాటిన వారు ధనిక రైతులుగా పరిగణింపబడతారు.

**కొత్త - పాత విముక్త ప్రాంతాలలో**

కొత్త విముక్త ప్రాంతాలలో ప్రజాతంత్ర ప్రభుత్వాలు ఏర్పడటానికి ఒక సం।।రానికి ముందు భూస్వాములు, ధనిక రైతులు దివాళా తీసి మధ్యతరగతి, పేద రైతులుగా మారిన వారు మధ్యతరగతి, పేద రైతులుగా గుర్తింపబడాలి. కొమింటాంగ్ పరిపాలనలో పీడనకు గురై దిగజారటంవలన ఒక సం।।రం వ్యవధి వర్గ స్థాయిలో మార్పుకు కారణమని వాస్తవం నిర్ణయింప బడింది. అయితే చాలా సం।।లుగా కఠినంగా శ్రమించి, కూడబెట్టుకోవడం ద్వారా పేదరికం నుండి పైకెదిగి, ధనికులుగా మారిన భూస్వాములు, ధనిక రైతులకు సంబంధించి భూస్వాములుగా, ధనిక రైతులుగా పరిగణింప బడటానికి 3 సం।।రాల వ్యవధి అవసరమౌతుంది.

పాత విముక్తి ప్రాంతాలలో ప్రజాతంత్ర ప్రభుత్వం క్రింద భారాల న్యాయపంపిణీ, కౌలు మరియు వడ్డీలు తగ్గించడం, 'ఋణాల పరిష్కార పోరాటాలు' మరియు ఇతర కారణాల వలన క్షీణించిపోయిన భూస్వాములు, ధనిక రైతులకు సంబంధించి, గత 5 సంవత్సరాలుగా వ్యవసాయ శ్రమ చేస్తూ, మళ్ళీ ఇతరులను దోపిడీ చేయని భూస్వాముల వర్గస్థానాలు రైతులుగా మారతాయి. (వాస్తవ పరిస్థితులను బట్టి మధ్యతరగతి, పేదరైతు, వ్యవసాయ కూలీగా నిర్ణయింపబడతారు). అదే సమయంలో గడిచిన 3 సం।।రాలుగా దోపిడీ ఆపివేసిన ధనిక రైతు వర్గస్థానం మధ్యతరగతి రైతుగా ఉంటుంది. అయితే వీరిలో ఇంకా చాలా భూస్వామ్య తరహా ఆస్థులను కలిగి వున్నవారు మిగులు ఆస్థులను పేద వ్యవసాయ ప్రజలకి పంచడానికి వదిలి వేయాలి. భూస్వాముల, ధనిక రైతుల వర్గస్థానం మారిన తరువాత, రైతు సంఘాలలో, పేద రైతు సంఘాలలో వారు చేరాలా, వద్దా అనేది వీరిని వ్యక్తిగతంగా రైతు సంఘాలు, పేద రైతు సంఘాలు పరీక్షించిన తరువాతనే నిర్ణయింపబడాలి.

1933 వర్గ విశ్లేషణలో ఈ విధంగా పేర్కొన్నారు: భూస్వామ్య, ధనిక రైతు కుటుంబాల రెడ్ ఆర్మీ శక్తులు కమాండర్లా, ఫైటర్లా అనే దానితో సంబంధం లేకుండా కార్మిక, రైతాంగ ప్రయోజనాల కోసం దృఢంగా యుద్ధం చేశారనే షరతు మీద, వారు వారి కుటుంబసభ్యులు పంపక భూమి పొంది ఉండే హక్కును కలిగి వుంటారు. అయితే ఇటీవల కొన్నిచోట్ల వీరి రాజకీయ తేటతెల్లతను బట్టి కాకుండా, సాంఘిక మూలాలనుబట్టి, శ్రామికుల ప్రయోజనాల కోసం దృఢంగా యుద్ధం చేసిన భూస్వామ్య, ధనిక రైతు కుటుంబాల రెడ్ ఆర్మీ ఫైటర్స్‌కు పంపిణీ చేసిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇది సరియైనది కాదు. 1933లో భూస్వామ్య, ధనిక రైతు సాంఘిక మూలాలు కల్గిన వారికి సంబంధించి ఈ చర్యలు తీసుకోవడం జరిగింది. ప్రస్తుతం, కొద్ది సంఖ్యలో భూస్వాములు, ధనిక రైతులకు సంబంధించిన వారు ప్రజా విమోచన సైన్యంలో చేరడానికి అనుమతింపబడ్డారు. వీరు స్వయంగా వారి కుటుంబాల నుండి వేరుపడి, విప్లవ విద్యను పొంది యుద్ధ పరీక్షలకు గురయ్యారు; వీరు యుద్ధంలో దృఢంగా, సాహసంగా వుండి, భూస్వాముల, ధనిక రైతులను రక్షించే, వ్యవసాయ సంస్కరణలకు భంగంకలిగించే కార్యకలాపాలలో పాల్గొనకుండా ఉంటే వీరి వర్గస్థానం మారాలి. సాధారణంగా వీరు విప్లవ సైనికులుగా గుర్తింపు పొందుతారు. ఎందుకంటే వీరు రక్తసిక్త యుద్ధకాండలో పాల్గొన్నారు. పౌర కార్యక్రమాలు సాగిస్తున్న వారి కన్నా వీరి వర్గ స్థాన పరివర్తనకు అవసరమైన కాల పరిధి తగ్గించబడాలి. సైన్యంలో పైన తెలిపిన షరతులను సంతృప్తి పరిచిన, మరియు రెండు పూర్తి సం।।రాలు సేవ చేసిన భూస్వాములు, ధనిక రైతులు మరియు ఇతర దోపిడి వర్గాల నుండి వచ్చినవారు; ఒక పూర్తి సం।।ము సేవ చేసిన భూస్వాములు, ధనిక రైతులు, ఇతర దోపిడీదారుల కుటుంబాల మేధావివర్గాల వారి వర్గ స్థానాన్ని విప్లవ సైనికులుగా మార్చవచ్చు. సాధారణంగా వీరికి, వీరి కుటుంబ సభ్యులకు వీరు స్వయంగా పంపకం చేసుకొన్న భూమి రైతులకు పంచినదాని కన్నా తక్కువగా ఉండ కూడదు. (రైతులకు పంచిన భూమి కన్నా ఎక్కువ ఉండకూడదు.) సైనిక చర్యల్లో చనిపోయిన వారిని, వికలాంగులైన వారిని, పదవీ విరమణ పొందినవారిని, విప్లవ సైనిక మృతవీరులుగా, వికలాంగులుగా, పదవీ విరమణ పొందిన యోధులుగా భావించాలి.

యుద్ధంలో ఊగిసలాట ప్రదర్శించినా లేదా అటువంటి నేరాలు చేసినా, వ్యవసాయ సంస్కరణ లకు వ్యతిరేకత లేదా భంగం కలిగించినా, వారు దీర్ఘకాలంగా సైన్యంలో ఉన్నప్పటికీ వారిని సైన్యం నుండి నిశ్చయాత్మకంగా తొలగించాలి.

5 సం॥రాల నుండి శ్రమ చేస్తున్న భూస్వాములను, 3 సం॥ల నుండి దోపిడీకి పాల్పడని ధనిక రైతుల వర్గ స్థానాలను మార్చడంలో ఏదైనా ప్రమాదం ఉందా? ప్రమాదమని నేను భావించను. ఎందుకంటే వారి భూమి, ఆస్థులు సమానంగా పంపకం చేయ బడ్డాయి. (మొత్తం ఆస్థులను కాకుండా, మిగులు ఆస్థులను మాత్రమే ధనిక రైతులను కోరడమైనది) మరియు చాలా సం॥రాలుగా శ్రమ చేస్తున్నందున, వారు సంస్కరింపబడగలిగారు. విముక్తి ప్రాంతాల లోని భూస్వాముల, ధనిక రైతుల వర్గ స్థానం మారినపుడు వ్యవసాయ సంస్కరణలు ఉధృత మవుతున్నపుడు సాధారణంగా వారు సైన్యంలో చేరే హక్కును తాత్కాలికంగా తొలగించమని సూచించవచ్చు. అయితే వ్యక్తిగత అనుమతి పొందిన వారిని మినహాయించాలి. కానీ శవాలను మోసే పటాలము, వారికి సహాయ పడే పనుల విభాగంలో వీరిని అనుమతించాలి.

**మధ్యతరగతి రైతులందర్ని నిశ్చయంగా ఐక్యం చేయాలి**

భూస్వామ్య వర్గాలను త్రోసివేయడమనేది ఒక నిర్దాక్షిణ్యమైన పోరాటం. దీనికి వెన్నెముక అయిన పేద రైతాంగంపై, వ్యవసాయ కూలీలపై మనము తప్పక ఆధారపడాలి. వారి డిమాండ్లను నెరవేర్చాలి. పైపోరాటం బాగా చేయగలగా లంటే ముందు మధ్యతరగతి రైతాంగంతో మనం ఐక్యం కావాలి. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ (1919) 8వ మహాసభ మధ్య తరగతి రైతులతో ఐక్యం కావాల్సిన అవసరం యొక్క ప్రాధాన్యతను ప్రత్యేకంగా నొక్కి వక్కాణించింది. మరియు ధనిక రైతులను మధ్యతరగతి రైతులతో గందరగోళపర్చడం కమ్యూనిజం సూత్రాలకు వ్యతిరేకమని కూడా పేర్కొంది. మధ్యతరగతి రైతు ప్రయోజనాలను అక్రమంగా ఆక్రమించడం, వారిని ఊగిసలాటకు గురి చేయటంవలన భూస్వామ్య, ధనిక రైతులచే వారు ఉపయోగించుకోబడుతారు కూడా, దీంతో పేద రైతులు, వ్యవసాయ కూలీలు ఏకాకు లవుతారు. ఈ విధంగా పరిస్థితి పరిణమిస్తే విప్లవం విఫలమవుతుంది. కనుక ఈ సమస్య ఈ విధంగా తీవ్రంగా ఎత్తి చూపబడింది.

**20 శాతం మధ్యతరగతి రైతులు**

పాత ప్రభుత్వంలో మధ్యతరగతి రైతులు దాదాపు జనాభాలో 20 శాతం ఉన్నారు. మొత్తంగా పాత విముక్తి ప్రాంతాలలో కొంచెం అటుఇటుగా వారు 50 శాతం ఉన్నారు. సర్వత్రా భూమి సమాన పంపకం జరిగిన తర్వాత గ్రామీణ ప్రాంతాలలో అత్యధిక సంఖ్యాక ప్రజలు మధ్యతరగతి రైతులుగా మారారు. మధ్యతరగతి రైతులు కానివారు స్వల్ప సంఖ్యలో ఉన్నారు. గతంలో జపాన్ వ్యతిరేక యుద్ధంలో మధ్య తరగతి రైతులు ఇచ్చిన దన్ను, డబ్బు స్వల్పం కాదు. జపాన్ వ్యతిరేక పోరాటంలో వీరు మెచ్చుకోదగిన కృషిచేశారు. ప్రస్తుతం కూడా కొమింగ్‌టాంగ్ అభివృద్ధి నిరోధకులతో పోరాటంలో సైన్యం, ధాన్యం కోసం ఎక్కువ భాగం వీరిమీద ఆధారపడ్డాం. ప్రస్తుతం మన ప్రజా విమోచన సైన్యంలో 30 నుండి 40 శాతం మధ్యతరగతి రైతులే. మధ్యతరగతి రైతుల ప్రయోజనాలను మనం దెబ్బ తీస్తే లేదా వారికి వ్యతిరేకంగా నిలబడుతూ పోతే ఇది మనం యుద్ధంలో ఓడిపోవడానికి కారణమౌతుంది. నూతన ప్రజాస్వామిక ఆర్థిక నిర్మాణంలో వ్యక్తిగత ఆర్థిక వ్యవస్థ నుండి సమిష్టి సహకార ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసే క్రమంలో పాత మరియు కొత్త మధ్యతరగతి రైతులే ప్రధాన ఆధారం. వారికున్న సంపద్వంతమైన ఉత్పాదక అనుభవాన్ని పేద రైతులు, వ్యవసాయ కూలీలు నేర్చుకోవలసి వుంది.

సాపేక్షంగా మెరుగైన వారి ఉత్పత్తి సాధనాలు పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు సహాయపడగలవు. భవిష్యత్తులో మధ్యతరగతి రైతులు మనతో కలిసి సోషలిజంలోకి ప్రయాణించగలరు. కాబట్టి మధ్యతరగతి రైతు మనకు శాశ్వత మిత్రుడు.

అయితే అందుబాటులో వున్న సమాచారం ప్రకారం అన్ని విముక్త ప్రాంతాలలో చాలాచోట్ల వ్యవసాయ సంస్కరణోద్యమం మందగించడం, "అతివాద" వైఖరితో మధ్యతరగతి రైతుల ప్రయోజనాల్ని అక్రమంగా ఆక్రమించడం, మరియు వారిని మినహాయించటం సంభవించింది. ఈరకమైన వైఖరి క్రింది సమస్యలలో వ్యక్తమైంది.

**ప్రయోజనాలు అతిక్రమించటం**

మొట్టమొదట, కొంతమంది మధ్యతరగతి రైతుల వర్గస్థానాలు తప్పుగా నిర్ధారించబడ్డాయి. ఉదాహరణకు, పైన తెలిపిన ఒక్క త్సాయీ చియాయీ పరిపాలనా గ్రామంలోనే, మధ్యతరగతి రైతులు, బాగా ఉన్న రైతులు (మరియు కొంతమంది పేద రైతులు కూడా) 50 కుటుంబాలకు పైగా దివాళా తీసిన భూస్వాములుగా, ఉత్పత్తిలో ఉన్న ధనిక రైతులుగా పిలవబడుతున్న వారిగా తప్పుగా నిర్ధారించబడ్డారు. చాలాచోట్ల వర్గ స్థానాలను తప్పుగా నిర్ధారించి వారి ఆస్థులను స్వాధీనం చేసుకోవటం, మరియు కొన్ని సందర్భాలలో వీరిని కొట్టటం జరిగింది కూడా.

రెండోది, నిర్వహణ విషయాలలో మధ్య తరగతి రైతుల భాగస్వామ్యం కోరకూడదని వ్యక్తపరిచారు. మధ్యతరగతి రైతులు ఇప్పటికీ తమ అవసరం ఉందా? లేదా? అని సందేహ పడుతున్నారు. ఇప్పటికే సమాన పంపిణీ సాగించిన పాత ప్రాంతాలలో తప్ప, వ్యవసాయ సంస్కరణోద్యమానికి వెన్నెముకగా ఉండిన పేద రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యం కావాల్సిన, పేద రైతు సంఘాలను సంఘటితం చేయాల్సిన అవసరముంది. అయితే కొన్నిచోట్ల పేద రైతులు, వ్యవసాయ కూలీలు ఆచరణలో ప్రతిదీ వారే నడుపుతున్న పరిస్థితికి చేరింది. ఇది తప్పు. ఉదాహరణకు, రైతు మహాసభలకు ప్రతినిధులుగా కమిటీ సభ్యులుగా పేదరైతులు, వ్యవసాయ కూలీలు మాత్రమే ఎన్నుకోబడుతున్నారు. మధ్యతరగతి రైతులు ఎవ్వరూ ఎన్నుకోబడటం లేదు; వర్గ స్థానాలను నిర్ధారించడంలో, వ్యవసాయ సంస్కరణల ఫలాల పంపిణీలో, మరియు పన్ను భారాల, సేవలు కేటాయించడం లాంటి అనేక ముఖ్యమైన సమస్యలపై నిర్ణయాలు చేయటంలో మధ్యతరగతి రైతులు పాల్గొనడానికి అనుమతించడం లేదు. దీనిచేత, మధ్యతరగతి రైతుల బ్రతుకు పూర్తిగా పేద రైతుల, వ్యవసాయ కూలీల చేతిలో ఉన్నదని వారు భావిస్తున్నారు; చాలా అశాంతిని ప్రదర్శిస్తున్నారు.

మూడోది, ప్రజాసంబంధ విధుల గురించి, ముఖ్యంగా మధ్యతరగతి రైతులపై పెరుగుతున్న భారం సమస్య గురించి వీరి

ఆలోచనలకు చోటివ్వడం లేదని వ్యక్తమౌతున్నది. ప్రజా ధాన్య పన్ను కేటాయించడంలో పేద రైతు, వ్యవసాయ కూలీ గ్రూపు మాత్రమే చర్చించి, నిర్ణయాలు చేస్తున్నదని కొన్నిచోట్ల కనుగొన్నారు. వ్యవసాయ సంస్కరణల తర్వాత, భూస్వాములు, ధనిక రైతులు బాధ్యతలను నెరవేర్చే పరిస్థితి లేదు కనుక, ప్రజా ధాన్య భారాన్ని మధ్య తరగతి రైతులపై మోపడమే కాకుండా వాటిని పంపకం చేసే పని వీరికి మరింతగా కేటాయించారు. ఈ విధానాలు మధ్యతరగతి రైతులలో వ్యతిరేకత పెరగడానికి కారణముగా ఉన్నవి.

ఇవన్నీ కాకుండా, వ్యవసాయ సంస్కరణల పంపిణీలో మధ్య తరగతి రైతులు ఏ మాత్రము ప్రయోజనం పొందని సంఘటనలు ఉన్నాయి. పోరాటాలలో మధ్యతరగతి రైతుల భాగస్వామ్యాన్ని కోరారని, పోరాటాల వల్ల ఎక్కువ పని సమయాన్ని నష్టపోయామని, ఇది ఇలా ఉండగా ఫలాల పంపిణీ సమయంలో వీరికి వాటా లేదని, కనీసం ఫలాల పంపిణీ సమావేశాలలో వీరు పాల్గొనటానికి అనుమతి కూడా ఇవ్వలేదని తెలుస్తోంది.

పై వైఖరులైన మధ్యతరగతి రైతుల ప్రయోజనాలను అతిక్రమించటం మరియు పరిగణనలోకి తీసుకోకపోవడం, మరియు వారిని వదిలివేయడం తీవ్రమైన ప్రమాదం.. ఇది మార్క్సిస్టు వ్యతిరేక, అతివాద దుస్సాహసిక వైఖరి. దీనిపట్ల మొత్తం పార్టీ దృష్టి సారించాలి, మరియు ఈ తప్పుడు వైఖరిని నిశ్చయంగా సరిదిద్దాలి. లేకపోతే, ఇది మనల్ని ఏకాకులను చేస్తుంది, మరియు విప్లవ ఓటమికి దారి తీస్తుంది.

**వారు దోపిడీదారులు కూడా**

మధ్యతరగతి రైతులతో పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అవి పరిష్కరింపబడగలవు. పాత సమాజంలో సాధారణంగా,మధ్యతరగతి రైతులు దోపిడీదారులు మరియు దోపిడీకి గురయ్యే వారు కూడా. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం, కొమింగ్‌టాంగ్ అభివృద్ధినిరోధక ప్రభుత్వాన్ని కూలదోయడం, భూస్వామ్య వ్యవస్థను తుడిచి పెట్టడం, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని డిమాండ్ చేయడం లాంటి ప్రాథమిక సమస్యలపైన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన పేద రైతులు, వ్యవసాయ కూలీలతో కలిసి ఉమ్మడి పోరాటం చేయడానికి మధ్యతరగతి రైతులకు పూర్తి అంగీకారం ఉంది. భూస్వాములకు, ధనిక రైతులకు వ్యతిరేకంగా పోరాడటానికి మధ్య తరగతి రైతులు తగినంత దృఢంగా లేకపోవడం, ఊగిసలాట, తటపటాయింపు ప్రదర్శిస్తున్నందు వల్ల పేద రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రధానంగా వీరిపట్ల అసంతృప్తితో కూడిన భిన్నాభిప్రాయంలో ఉంటారు.

ఈ తరహా బలహీనత మధ్యతరగతి రైతులలో వాస్తవానికి ఉంది. అయితే ఛైర్మన్ మావో–సే–టుంగ్ బోధించిన నాయకత్వ సూత్రాన్ని అమలుపరిచినట్లైతే, నిర్దిష్టంగా చెప్పాలంటే భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా, పోరాడటానికి, గెలవడానికి మధ్యతరగతి రైతుల్ని దృఢంగా నడపడం మరియు అదే సమయంలో వారి ప్రయోజనాలకు హాని కలిగించడకుండా, వారికి రాజకీయ చైతన్యాన్ని ఇస్తే వారిని ఐక్య పోరాటంలో నడపగలం. రెండోది, సమాన భూమి పంపిణీలో, సంపన్న మధ్యతరగతి రైతులు కొంత భూమిని ఇచ్చివేయడానికి ఇష్టపూర్వకంగా ఉండరు. భూస్వామ్యవ్యవస్థను తుడిచిపెట్టడానికి సమాన భూపంపిణీ చాలా సమగ్రమైన, మేలైన విధానము. సమాన భూపంపిణీలో దాదాపు అత్యధిక సంఖ్యాక మధ్యతరగతి రైతులు వారి భాగం భూమిని స్వాధీన పరచలేదు, వారికి భూమి పంచబడనూలేదు. సంపన్న మధ్యతరగతి రైతులు కొద్దిమందికి మాత్రమే కొద్దిభూమిని ఇచ్చి ఉండవచ్చు (వారి ఇతర ఆస్తులను తాకనివ్వలేదు). అదే సమయంలో క్రింది మధ్యతరగతి రైతులకు కొద్దిభూమిని పంచి ఉండవచ్చు. కొత్త ప్రభుత్వంలో మధ్యతరగతి రైతులు చాలా రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక ప్రయోజనాలను పొందారు, కనుక సాధారణంగా మధ్యతరగతి రైతులు భూ సమాన పంపిణీకి అనుకూలంగా ఉన్నారు. అయితే సమాన భూపంపిణీని కొనసాగించడానికి మధ్యతరగతి రైతులతో విషయాలను మాట్లాడి వారి అంగీకారము పొందాల్సిన అవసరముంది. సంపన్న మధ్యతరగతి రైతుల భూములు కొంతభాగాన్ని తీసుకుంటే, వారు స్వయంగా వ్యతిరేకతను వ్యక్తం చేయవచ్చు. వారికి రాయితీనివ్వాలి. వారి భూమి జోలికి వెళ్లకూడదు. వ్యవసాయ సంస్కరణల ఫలాల పంపిణీలో, ఐక్యతను కాపాడుకోవడానికి వ్యవసాయ సంస్కరణల ఫలాలలో కొంత భాగాన్ని మధ్యతరగతి రైతులకు పంపిణీ చేయాలని పేద రైతులు, వ్యవసాయ కూలీలకు వివరించాలి. మొత్తంగా చెప్పాలంటే, మధ్య తరగతి రైతులను ఐక్యం చేయడానికి అన్ని సమస్యలపై శ్రద్ధపెట్టాలి. మనం భూస్వామ్యాన్ని తుడిచి పెట్టడానికి, యుద్ధంలో గెలవడానికి గ్రామీణ జనాభాలో 90 శాతాన్ని ఐక్యం చేయాలనే మౌలిక షరతును అర్థం చేసుకోవాలి. “దాడి ప్రాంతం” అసలైన భూస్వామ్య దోపిడి వర్గాల పరిధికి లోబడి ఉండాలి, ఈ పరిధిని దాటి అడుగేయరాదు. కొమింటాంగ్ పాలిస్తున్న ప్రాంతానికి ప్రజా విమోచన సైన్యం చేరినపుడు “దాడి ప్రాంతం” చాలా బాగా తగ్గించుకోవాలి. ఇలాంటి చోట్ల, మొదట పెద్ద భూస్వాములు, పెద్ద దుర్మార్గులు, స్థానిక నియంతలు, భూస్వామ్య సాయుధ మూకలు, ‘పావోచియా’ వ్యవస్థ మరియు ప్రత్యేక సేవా ఏజెంట్లపై గట్టి దెబ్బకొట్టాలి. తరువాత, సైన్యం విజయాలు, పునాది ప్రాంతాలు సంఘటితంకావడం, ప్రజల చైతన్యం, సంఘటిత స్థాయి పరిస్థితులను బట్టి క్రమంగా మొత్తం భూస్వామ్య వ్యవస్థను తుడిచిపెట్టడానికి ముందుకు పోవాలి.

**ఎలా ఐక్యం చేయాలి?**

మధ్యతరగతి రైతులందరిని ఐక్యపరచ డానికి, మొట్టమొదట మనం వారి ప్రయోజనాలకు భంగం కలగకుండా, మరియు వారి వర్గ స్థానాలను సరిగా నిర్ధారించేటట్లు చూడాలి. ఎవరి వర్గ స్థానాలు ఇప్పటికే తప్పుగా నిర్ధారించబడ్డాయో వాటిని తిరిగి నిర్ధారించాలి. గతంలో, అప్పటికి వర్గ విశ్లేషణ తెలియనందున తప్పులు జరిగాయని వారికి వివరించాలి. ఎవరి

ఆస్తులు పొరబాటుగా స్వాధీనం చేసుకోబడ్డాయో వాటిని వీలైనంత త్వరలో వెనక్కి తీసుకోవచ్చు. ఇప్పటికే పంపిణీ చేయబడిన ఆస్థులు వినియోగించబడినట్లైతే, భూస్వాముల నుండి స్వాధీనం చేసుకోబడిన ఫలాలలో భాగాలను తీసుకొని వారికి నష్టం భర్తీ చేయబడాలి. పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు అత్యవసరాల కోసం మధ్యతరగతి రైతుల మిగులు ధాన్యం లాంటివి అప్పుగా తీసుకోవచ్చు. మధ్యతరగతి రైతులు స్వచ్ఛందంగా కొంతధాన్యాన్ని విపత్తు సహాయంగా ఇస్తే చాలా మంచిది.

రెండవది, మధ్యతరగతి రైతులను నిర్వహణ విషయాలలోకి తప్పకుండా తీసుకోవాలి. మధ్య తరగతి రైతులు రైతు మహాసభ ప్రతినిధులలో, రైతు సంఘ కమిటీలో తప్పకుండా ఉండాలి. ఆ విధంగా వీరు రాజకీయ హక్కులను వాస్తవ అర్థంలో అనుభవిస్తారు. పేద రైతులు, వ్యవసాయ కూలీలు అత్యధిక సంఖ్యాకులుగా ఉండేచోట, రైతు మహాసభలో, రైతు సంఘ కమిటీలో సుమారుగా 1/3వంతు మధ్యతరగతి రైతులు ఉండవచ్చు; దాదాపు 2/3వంతు పేద రైతులు, వ్యవసాయ కూలీలు ఉంటారు. పాత విముక్తి ప్రాంతాలలో మధ్యతరగతి రైతులు అత్యధిక సంఖ్యాకులుగా(శ్రామికులలో) ఉన్నారు. మధ్యతరగతి రైతులలో ఎక్కువమంది పేద రైతుల నుండి ఎదిగి వచ్చినవారే. వ్యవసాయం మధ్యతరగతి రైతులతో పెంచబడాలి. పేద రైతులు మరియు వ్యవసాయ కూలీలు సుమారుగా 1/3వంతు ఉండవచ్చు. మధ్యతరగతి రైతులు 2/3వంతు ఉంటారు. ప్రతి ప్రభుత్వ సంస్థ మధ్యతరగతి రైతుల భాగస్వామ్యాలు కలిగి ఉండాలి.

అన్ని సమస్యల గురించి, వర్గస్థాయిని నిర్ధారించడం, భారాల పంపిణీని కేటాయించడం, భూమి మరియు ఆస్థుల పంపిణీ లాంటి అన్ని సమస్యలను మొదట పేద రైతుల సంఘాలు (గ్రూపులు) చర్చించవచ్చు. వాటిని అమలు పరచబోయేముందు వాటిని చివరగా అన్ని తరగతుల రైతులు వున్న రైతుసంఘం అంగీకరించాలి. అంతేకాకుండా, సమావేశాలలో, మధ్యతరగతి రైతుల అభిప్రాయాల్ని జాగ్రత్తగా గౌరవించాలి, వారి మంచి అభిప్రాయాల్ని ఆమోదించాలి. మధ్య తరగతి రైతులు తప్పుడు అభిప్రాయాల్ని పెడితే, వాటిని ఓపికగా విని, తగిన విమర్శ చేయాలి. ప్రత్యేక పరిస్థితులలో విమర్శ అవసరమైనప్పటికీ, మధ్యతరగతి రైతుల్ని పోరాటానికి ఐక్యం చేయడమే ప్రాథమిక సూత్రముగా వుండాలి.

మూడవది, ప్రజా సంబంధ విధులలో సమాన న్యాయ పంపిణీ సాధించబడాలి. ఉదాహరణకు, ప్రజాధాన్యభారం. ఈ రంగానికి బలం, మానవ వనరుల సమీకరణ, ఆర్థిక వనరులు. వీటిని భూస్వాములు ధనిక రైతులు భరించలేరు కనుక, పూర్తిగా మధ్యతరగతి రైతుల మీద మోపకూడదు. మధ్యతరగతి రైతులు దీన్ని గురించే ఎక్కువగా భయపడుతున్నారు. ఇది సరైనది కాదు కూడా. ప్రజాప్రతినిధుల విషయంలో పేద రైతులు, వ్యవసాయ కూలీలు తగిన విధంగా బాధ్యతను తీసుకోవడం అవసర మున్నది; అయితే మధ్యతరగతి రైతుల కంటే చాలా తేడా ఉండకూడదు. చివరికి, అన్ని తరగతుల రైతులు కలిగి వున్న రైతు సంఘం ప్రజా సంబంధ విధుల పంపిణీని చర్చించి ఆమోదించాలి.

వర్గస్థానాల్ని తప్పుగా నిర్ధారించనంత కాలం, మధ్యతరగతి ప్రయోజనాలు హరించ బడవు, వారు నిర్వాహణ విషయాలలో కలుపుకొనబడతారు. మరియు ప్రజాసంబంధ విధుల పంపిణీ సరిగా జరిగినంతకాలం, రోజువారీ విషయాలలో మధ్యతరగతి రైతుల్ని పరిగణనలోకి తీసుకొని వారు నిలకడగా చైతన్యం చేయబడినపుడు, మధ్యతరగతి రైతులు పూర్తిగా ఖచ్చితంగా, బాగా ఐక్యం చేయబడగలరు.

అపుడు ఇది కమ్యూనిజం సూత్రాల ప్రకారంగా ఉంటుంది. ప్రధాన పత్రికలన్నీ నిలకడగా శ్రద్ధ వహించి అన్నివేళలా తనిఖీ నిర్వహించాలి; మధ్యతరగతి రైతుల ప్రయోజ నాలు హరించబడుతూ వారిని వదిలివేస్తూన్నట్లు కనుగొనబడితే, వాటిని బహిరంగపర్చాలి. వాటిని అందరికి తెలియజేసి, పత్రికలలో ప్రచురించాలి.

(గమనిక:- "ఉత్పత్తి చేస్తున్న ధనిక రైతు" అనే పదము తప్పుగా వాడబడింది. దీనిని గతంలో కొంతమంది శ్రామికులు షాన్సి- సూయాన్ ప్రాంతంలో దీనిని ఉపయోగించారు. కొన్ని కుటుంబాల ఆస్తులు సాపేక్షంగా ఎక్కువగా వున్నందున, వారు దోపిడీ సాగించకపోయినప్పటికీ వారిని తప్పుగా ధనిక రైతులుగా విశ్లేషించారు. దోపిడీ స్థాయిని ప్రాతిపదికగా తీసుకొనే బదులు, ఆస్థుల పరిమాణము, జీవన స్థాయిలను తీసుకొని ప్రజలను ధనిక రైతులుగా విభజించడం పూర్తిగా తప్పు. జెన్ పి-షిన్ ఈ పదములోని తప్పును విమర్శించాడు.)

**భూస్వాములకు, ధనిక రైతులకు వ్యతిరేకంగా పోరాడే పద్ధతులు**

ఆర్థికంగా భూస్వాముల్ని ఒక వర్గంగా తీసివేయడం సులువైన విషయం కాదు. ఇది ఒక బలమైన యుద్ధం. రాజకీయంగా భూస్వామ్య వర్గాన్ని కూలద్రోసిన తరువాత, ఆర్థికంగా వారి బలాన్ని నిలబెట్టుకోవడానికి వీలైన అన్ని కుట్రలను చేసి, ఎప్పటికైనా పునరుద్ధ రించుకోవాలని యోచిస్తారు. భూస్వాములు, ధనిక రైతులు అన్ని పార్టీల్లోకి, ప్రభుత్వంలోకి ప్రవేశించడానికి అన్ని రకాల పెద్దలను శోధిస్తారు, వాళ్ళ కూతుళ్ళని ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగులకు ఇచ్చి పెళ్లి చేయడం, అవినీతి పరులను, చెడ్డ ఉద్యోగులను, చెడు పార్టీ సభ్యులను కొనుగోలు చేస్తుండటం చేస్తారు. కాబట్టి వ్యవసాయ సంస్కరణలను నిలకడగా నిర్వహించడానికి నాయకత్వంలో చాలా సున్నితత్వం, కళ అవసరం. ప్రజల్ని కదలికలో ఉంచినపుడు మాత్రమే భూస్వామ్య వర్గాల్ని త్రోసి వేయగలము. తేలికైన ఆనాలోచితమైన పద్ధతులు ఎట్టి పరిస్థితులలో అన్వయించకూడదు.

(భూస్వామ్య వర్గాన్ని త్రోసివేయడం మరియు ఫ్యూడల్ వ్యవస్థను తుడిచిపెట్టడంలో) ప్రధానంగా భూమి, ధాన్యం, దున్నే పశువులు, వ్యవసాయ పరికరాలు మొదలగు భూస్వామ్యవర్గ ఆస్తులను స్వాధీనం చేసుకోవడం మరియు ధనిక రైతుల మిగులు ఆస్తులను రైతులకు పంపకం చేయమని కోరడం అనే ప్రధాన కర్తవ్యాలు ఉంటాయి. వీటిలో భూమి పంపకం చాలా ప్రాముఖ్యత కలది. భూమి పంపకం తర్వాత ఇబ్బందులు తొలగించుకోవడానికి సహాయంగా ప్రభుత్వం రైతులకు వ్యవసాయ

ఋణాలు ఇవ్వాలి, పారిశ్రామిక తరహాలో రైతులను ఉత్పత్తి చేయమని కోరాలి; వ్యవసాయ సాంకేతికతను అభివృద్ధి చేయాలి, పరస్పర సహాయ, సహకార ఉద్యమాన్ని పెంచాలి, ఆవిధంగా రైతుల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. శత్రువును గెలవడానికి ప్రజాతంత్ర ప్రభుత్వం మరియు ప్రజా విముక్తి సైన్యం తగినంత ప్రజాపంపిణీ ధాన్యాన్ని కలిగి ఉంటాయి. ఆ విధంగా రోజూ ధాన్యం, ముడిసరుకు పరిమాణం పెరుగుతుండటంతో పట్టణ ప్రజలకు, పరిశ్రమల వస్తువులను ఉత్పత్తి చేయడానికి తగినంత సరుకులుగా అమ్మబడతాయి.

ధనిక రైతుల వ్యతిరేక పోరాటానికి, భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి తేడా చూడాలి. భూస్వామ్యవర్గం యొక్క భూ యాజమాన్యం హక్కు రద్దును, మరియు భూస్వాముల దున్నే పశువులు, వ్యవసాయ పరికరాలు, భవనాలు, ఇతర ఆస్తుల స్వాధీనానికి చైనా వ్యవసాయ చట్ట మౌలిక కార్యక్రమము నొక్కి చెప్తున్నది. సమానంగా పంపిణీ చేయబడిన భూమి కాకుండా, ధనిక రైతులకు సంబంధించిన ఇతర మిగులు ఆస్తులను కోరడం జరిగింది. మొత్తం స్వాధీనం కాదు. భూస్వామ్య వ్యతిరేక పోరాటం లాగా ధనిక రైతులకు వ్యతిరేక పోరాటం ఉంటే పైన చెప్పిన తేడా గందరగోళం అవటమే కాకుండా మధ్యతరగతి రైతులు భయాందోళన చెందడానికి, ఊగిసలాటకు దారి తీస్తుంది. భూస్వామ్య, వ్యతిరేక పోరాట పద్ధతులకు పెద్ద, మధ్య, చిన్న భూస్వాముల వ్యతిరేక పోరాట పద్ధతులకు మధ్య తేడా చూడాలి. నిరంకుశులకు – నిరంకుశ రహితుల మధ్య కూడా తేడా చూడాలి. పెద్ద భూస్వాములు, నిరంకుశుల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించి, ఇతర భూస్వాములకు హెచ్చరికగా, భూమి, ఇతర ఆస్థులు ఇచ్చి వేసిన వారి గురించి ప్రజల మధ్య సమావేశాలు జరపనవసరం లేదు.

**సాంఘిక భద్రత**

భూస్వాముల వర్గ దోపిడీ వ్యవస్థను త్రోసివేసే విధానాన్ని అవలంబిస్తాము. అయితే వ్యక్తిగా భూస్వామిని నిర్మూలించే విధానాన్ని అవలంబించం. చైనా వ్యవసాయ చట్ట మౌలిక కార్యక్రమానికి అనుగుణంగా కొద్దిమంది ఉద్యోగులు కోర్టులో విచారించబడి, శిక్షబడిన పౌరయుద్ధ నేరస్థులకు మినహా రైతులకిచ్చిన దానికన్నా ఎక్కువ, తక్కువ కాకుండా భూమిని, ఇతర ఆస్థులను భూస్వాము లందరికి ఇవ్వబడుతుంది. వారిచే ఆ శ్రమ చేయించాలి, సంస్కరించాలి. ఎందుకంటే భూస్వామి శ్రమలో పాల్గొంటున్న తరువాత, అతను చిన్న ఉత్పత్తి శక్తి కాదు. ఇది కూడా ఎందుకంటే మనము వారికి అవసరమైనంత భూమి, ఇతర ఆస్థులు పంచకపోతే, వాళ్ళు దొంగతనము, దోపిడీ, అడుక్కోవడం చేసి, సాంఘిక అభద్రతను తేవడం వలన రైతులు ఆ విధంగా కష్టాలకు గురవుతారు. ఉరిశిక్ష పడని నేరస్తులకు కూడా కోర్టు అవసరమైనంత భూమిని మరియు ఆస్థులలో వాటా ఇవ్వాలి. అపుడు మాత్రమే సాంఘిక భద్రత ఉంటుంది. భూస్వామికి వారి జీవనానికి తగినంత మద్దతు నిచ్చే పరిశ్రమ లేదా వ్యాపారముంటే అతనికి భూమి పంపకం చేయాల్సిన అవసరముండదు. ఆ పరిశ్రమ లేదా వ్యాపారము వారి జీవనానికి తగినంత మద్దతు ఇచ్చే పరిస్థితి లేకుంటే అవసరమైనంత భూమిలో భాగము పంపకం చేయాలి.

**కొత్త తరహా ధనిక రైతులు**

కొత్త ధనిక రైతులతో – పాత ధనిక రైతులతో వ్యవహరించుటలో వ్యత్యాసం ఉండాలి. కొంతమంది వ్యవసాయం చేసే పేద ప్రజలు శ్రమద్వారా, ప్రజాతంత్ర ప్రభుత్వంలో ఉత్పత్తి అభివృద్ధి చెందడం ద్వారా కొత్త తరహా ధనిక రైతులుగా మారారు. సమాన భూపంపకం కాలంలో, వీరిని సంపన్న మధ్యతరగతి రైతులుగా భావించాలి. సమాన భూ పంపక కాలంలో సాధారణంగా వీరికి మధ్యతరగతి రైతుల స్థాయి కంటే అధికంగా వున్న భూమిని వారి అంగీకారంతో మాత్రమే తీసుకోవాలి. వారు స్వయంగా అంగీకరించకుంటే వారి భూమిని స్వాధీనం చేసుకోకూడదు. గతంలో, వువాన్– యు లాంటి ఈ తరహా ధనిక రైతుల్ని మనము ప్రోత్సహించాము(యేనాన్ సరిహద్దు ప్రాంతంలో ప్రసిద్ధమైన శ్రామిక నాయకుడు). వారి ఉత్పత్తిని వృద్ధి చేయడానికి, మధ్యతరగతి రైతులు స్థిరత్వం పొందడానికి, ఉత్పత్తిలో ఉత్సాహాన్ని రేకెత్తించడానికి ఇది గొప్ప పాత్ర పోషించింది.

**పారిశ్రామిక వాణిజ్య విధానం**

సాధారణంగా పరిశ్రమలు, వాణిజ్యం రక్షింపబడాలి. భూస్వాములు, ధనిక రైతులు నిర్వహిస్తున్న పరిశ్రమలు, వాణిజ్యం సైతం స్వాధీనం చేసుకోబడకూడదు. దీని ప్రకారం ఇవి ప్రజాతంత్ర ప్రభుత్వంయొక్క రక్షణను పొందాలి. నిరంకుశ పెట్టుబడిదారుల, నిజమైన నిరంకుశ విప్లవ ప్రతీఘాత శక్తుల పరిశ్రమల్ని వాణిజ్యాన్ని మాత్రమే స్వాధీనం చేసుకొని వాటిని రాజ్యం లేదా ప్రజల యాజమాన్యం క్రింద ఉంచాలనేది పార్టీ విధానం. (ప్రభుత్వం) ఇంకా స్వాధీనం చేసుకొన్న పరిశ్రమల్లో, జాతీయ ఆర్థిక వ్యవస్థ అవసరాల కోసం వాణిజ్యాన్ని కొనసాగేటట్లు చేయాలి; వాటి పనులను ఆపకూడదు మరియు వాటిని దెబ్బ తీయకూడదు లేదా ఏం చేయటం ద్వారా చెదరగొట్టకూడదు. కౌలురేట్లు, వడ్డీరేట్లు, తగ్గించే కాలంలో భూస్వాములు వారి భూములు అమ్మి పరిశ్రమల్లో, వాణిజ్యంలో పెట్టుబడి పెట్టిన వాటిని – వారికి వ్యతిరేకంగా వాటిని స్వాధీనం చేసుకోవచ్చా? గతంలోకాని, ఇపుడు కాని ఇటువంటి పరిశ్రమలకు, వాణిజ్యాన్ని రక్షించి, ప్రోత్సహించాలి. ఎందుకంటే చైనా ఆర్థిక వ్యవస్థ వృద్ధి కావాలంటే ఇవి ప్రయోజనకరము మరియు అవశ్యకము. భూస్వాముల రహస్య సంపదను పొందటానికి, పరిశ్రమను నాశనం చేయటానికి శిక్షించైనా సరే భూస్వామికి అనుమతి నివ్వకూడదు.

దీర్ఘకాలిక – అందరి ప్రయోజనాలను, పాక్షిక – తాత్కాలిక ప్రయోజనాలకు లోబరచాలి. ఉదాహరణకు, భూస్వాములు బొగ్గుగనులు నిర్వహిస్తుంటే, ప్రస్తుత పాక్షిక ప్రయోజనం దృష్టి నుండి గనులను స్వాధీనం చేసుకొని పంపకం కోసం రైతులు మద్దతు తెలిపి చేతులు ఎత్త వచ్చు, ఎందుకంటే, బొగ్గు గనుల పరికరాలు, ముడిసరుకులు ప్రతి ఒక్కరికి పంపకం చేయబడతాయి. ఇవి తాత్కాలికంగా వారి వారి సమస్యలు పరిష్కరింపవచ్చు. ఈ పరిస్థితులలో, మనం గనులు ఉన్నందువల్ల కలిగే ప్రయోజనా లను

రైతులకు అర్థం చేయించి ఒప్పించాలి. వాటిని చెదరగొడితే, బొగ్గు గనులు నాశనం చేయబడతాయి. మరియు దాంతో రైతులకు మంట వేసుకోవడానికి బొగ్గు ఉండదు. విముక్తి ప్రాంతాల ఆర్థిక అభివృద్ధిని ఇది ఆటంక పరుస్తుంది.

మనము స్వతంత్రంగా ఉండాలని భావిస్తే, ప్రజా నిర్వాహణ, ప్రయివేట్ నిర్వాహణ, ప్రజా సహకార చేతివృత్తుల పరిశ్రమలు మరియు గ్రామీణ వ్యవసాయము అభివృద్ధి అయ్యేటట్లు చేయాలి. ప్రజా విముక్తి సైన్యం కోసం పెద్ద ఎత్తున సరుకులు, ధాన్యం ఉత్పత్తి చేయాలి. ఆ విధంగా వరక్తం బయట ప్రాంతంతో సరి తూగేటట్లు చేయగలము. చాంగ్ కైషేక్ లేదా అమెరికా నియంత్రణలోని ప్రాంతాల సరుకుల మీద ఆధారపడకుండా అనుకూలవర్తక నిల్వలను ఉంచుకోగలము.

ప్రస్తుతం, ప్రపంచమంతా దుకాణాలు పెట్టడానికి తగినంత బలము విముక్తి ప్రాంతాలలోని ప్రభుత్వ వర్తక కంపెనీలకు లేదు. సహకార సంఘాలు ప్రపంచమంతా అభివృద్ధి కాలేదు. లేదా కొన్నిసార్లు సరిగా నడవడం లేదు. కాబట్టి, ప్రైవేట్ వాణిజ్యం ఉనికి అవసరమున్నది. వ్యాపారస్తులు దోపిడీ సాగించవచ్చు; వర్తకుల వాణిజ్య కార్యకలాపాలు వాటికవి ఏమీ విలువను ఉత్పత్తి చేయవు. అయితే సమస్య ఏంటంటే వాణిజ్యాన్ని నాశనం చేయవు, వాణిజ్యానికి నాయకత్వాన్నిస్తాయి. వాటి విధానాలు ప్రజలకు ప్రయోజనం, సమంజసమయిన వ్యాపారులకు ప్రయోజనం కూడా కలిగిస్తాయి.

పరిశ్రమ మరియు వాణిజ్యం నుండి పన్నులు వసూలు చెయ్యాలి. అయితే సరైన పన్నురేట్లను స్థిరపరచాలి. అయితే మరీభారంగా ఉండకుండా చూడాలి. వారి యొక్క పనులను మరియు అభివృద్ధిని దెబ్బతినకుండా ఉండే సూత్రం మీద ఆధారపడి ఈ పన్నువిధానం ఉండాలి.

**మేధావులు మరియు ఉన్నత హోదాగలవారు**

అత్యధిక ప్రొఫెసర్లు, టీచర్లు, సైంటిస్టులు, ఇంజనీర్లు, ఆర్టిస్టులు, మొదలగువారు భూస్వామ్య, ధనికరైతు, పెట్టుబడిదారుల కుటుంబాల నుండి వచ్చారు. అయితే వీరు స్వయంగా ఒకరకమైన మేధో శ్రమ చేస్తారు. ఈ మేధో శ్రామికుల పట్ల ప్రజాతంత్ర ప్రభుత్వం వీరిని రక్షించే విధానాన్ని అనుసరించాలి. వీరు వీలైనంత మేరకు ప్రజల ప్రజాతంత్రానికి సేవ చేసేట్లుగా వీరిని గెలుచుకోవాలి. కొమింటాంగ్ పాలన క్రింద, వీరిలో అత్యధికులు ఆర్థికంగా చాలా కష్టాలపాలై, రాజకీయంగా స్వేచ్ఛ రహిత జీవితాన్ని గడిపారు. పైగా వీరిలో చాలా మంది నిరుద్యోగులు. శాస్త్రీయ పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు వీరికి అవకాశాలు స్వల్పాతి స్వల్పం. చాంగ్‌కైషేక్ మరియు అమెరికా సామ్రాజ్యవాదం యొక్క అన్ని రకాల అవినీతి, లంచగొండితనం, అభివృద్ధి నిరోధకత్వం చూసి వీరిలో అత్యధికులు అమెరికన్ సామ్రాజ్యవాద దుందుడుకుతనం, కొమింటాంగ్ పాలన పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తుంటారు. వీరిని మనం జాగ్రత్తగా రాజకీయంగా, భావజాలపరంగా మార్గనిర్దేశము చేస్తే, వారికి సరైన చైతన్యము ఇచ్చి, సంస్కరిస్తే చైనా ప్రజల ప్రజాతంత్ర నూతన ప్రజాతంత్ర రాజ్యానికి వారి పరిజ్ఞానం, సాంకేతికత ఉపయోగపడుతుంది.

కొమింటాంగ్ నడుపుతున్న నగరాలలో గత కొన్ని సం॥లుగా విద్యార్థి ఉద్యమ పోరాట అనుభవాలకు సంబంధించి, విద్యార్థుల కోసం మన భావజాల సంస్కరణోద్యమం, పనివిధానం, క్యాడర్–పరిశీలన, చాంగ్‌కైషేక్ అభివృద్ధినిరోధక నియంతృత్వ పరిపాలనలో అసంతృప్తిచెందుతూ, ప్రజాస్వామ్యాన్ని డిమాండ్ చేస్తున్నారు. వారిలో కొద్దిభాగం లేదా చాలా చిన్నభాగం దిద్దుబాటుకు గురికాని అభివృద్ధి నిరోధక శక్తులుగా ఉన్నారు; వీరు ప్రత్యేకంగా విప్లవానికి వ్యతిరేకంగా పనిచేస్తూ, విద్యార్థి ఉద్యమానికి ఆటంకం కలిగిస్తున్నారు. కాబట్టి విద్యార్థుల, మేధావుల అభివృద్ధికి మనం సహాయపడాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామ్యం కోసం జరిగే పోరాటాలలోకి వీరిని సమీకరించాలి.

మనం నూతన ప్రజాతంత్ర దేశాన్ని నిర్మించాలంటే మనకు జ్ఞానం అవసరం. ఉదాహరణకు, హాస్పిటల్స్ స్థాపించేటపుడు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసిన్, సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, డెంటిస్ట్రీ మొదలగు వాటిని మనం ఏర్పాటు చేయాలంటే, మనం ఎక్కువ మంది డాక్టర్లను, వైద్య సహాయకులను, మరియు నర్సులను కలిగి ఉండాలి. చాలా కాలం చదివి తరువాత ఆచరణాత్మక పనిలో నలిగిన ఈ సిబ్బంది మాత్రమే శిక్షణ పొందగలరు. ప్రస్తుతం మనకు ఇంకా చాలా స్పెషలిస్టులు లేరు. ప్రజల కోసం పనిచేయడానికి చైనాలో ప్రస్తుతమున్న మేధావుల్ని, సైంటిస్టుల్ని నిల్వ వుంచకుండా గెలుచుకొని, వినియోగించుకోవాలి. ఒకవైపు ఈ మేధావుల గ్రూపును వినియోగించుకుంటూ, రెండోవైపున ప్రజలను అవమానపరిచే వీరి అలవాట్లను సరిచేస్తూ, ప్రజారాశుల నుండి వేరుపడకుండా, వారిలో ఒకరిగా ఉండేటట్లు వీరికి పునఃచైతన్యం కలిగిస్తూ సంస్కరించాలి.

భూస్వామ్య వ్యవస్థను కూలదోస్తున్నపుడు, భూస్వామ్య వ్యవస్థతో సంబంధము ఉన్న మేధావుల బహిష్కరణకు వ్యతిరేకంగా రక్షణగా నిలవాలి. లేకుంటే ప్రజల పక్షానికి హాని చేస్తుంది. అదే సమయంలో, కార్మిక, రైతాంగ మూలాల యొక్క మేధో వర్గానికి శిక్షణ ఇవ్వడానికి మనము ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. కార్మికులు, రైతాంగం స్వయంగా విముక్తి పొంది జ్ఞానం పొందుతారు. వారిలో మెరుగైన వారు శిక్షణ పొందుతారు లేదా వాళ్ళ బిడ్డలు మేధావులుగా మారతారు. అంతేకాకుండా నిర్మాణ కర్తవ్యాలను మోస్తారు. జపాన్ వ్యతిరేక యుద్ధ కాలంలో, లిటింగ్–మింగ్ మరియు ఇతరులవలె వివేకవంతులైన హోదాలు గల పెద్దల గ్రూపు ఒకటి ఉండేది. వీరు ప్రభుత్వంలో – ప్రజా సభలలో పాల్గొనేవారు. ఇది చాలా సరియైనది, అవసరమైనది. ఇది చాలా మంచి ప్రభావాన్ని దేశం మొత్తం మీద పడవేసింది. గతంలో వీరు మనతో కలిసి జపాన్‌కు వ్యతిరేకంగా పోరాడారు, ఇప్పుడు మనతో కలిసి కొమింటాంగ్ అభివృద్ధి నిరోధకులకు వ్యతిరేకంగా పోరాడతారు. వారు ఆయనతో కలిసి ఉమ్మడి కష్టాలను పంచుకున్నారు. ఈ ప్రజల పట్ల సమంజసమైన వైఖరి మనం అవలంబించాలి. వారు తప్పులు చేస్తే విమర్శించాలి కాని వారి వ్యక్తిత్వాలను కించపరచకూడదు. గతంలో ప్రతిభావంతమైన పనులు చేసిన వారిని, వ్యవసాయ సంస్కరణలను, కొమింటాంగ్ అభివృద్ధి నిరోధకులను కూలద్రోయడాన్ని ఆమోదిస్తున్న వారిని పనిలో కొనసాగించవచ్చు.

**హింస మరియు ఉరిశిక్షల సమస్య**

నేరస్థులను అనధికారికంగా కొట్టడం, చంపడం, మరియు శారీరకమైన శిక్షలను అవలంబించడం కమ్యూనిస్టు పార్టీ దృఢంగా వ్యతిరేకిస్తుంది. విచక్షణా రహితంగా కొట్టడం, చంపడాలు మరియు శారీరక శిక్షలు భూస్వామ్య వ్యవస్థ యొక్క ఫలాలు. ఫ్యూడల్ ప్రభువులు బానిసల మీద, యుద్ధ ప్రభువులు సైనికులు మీద మాత్రమే వీటిని అమలు జరిపేవారు.

వ్యవసాయ సంస్కరణోద్యమ కాలంలో ప్రజల్ని కొట్టడం, చావుకు కారణమయ్యే ఘటనలు సంభవించాయి. కొద్దిగాకాదు, చాలా ఎక్కువగా జరిగాయి, ఎందుకంటే పార్టీలోనే మురికి ఉంది. భూస్వాములు, ధనికరైతులు, అవకాశవాద శక్తులు, అరాచక కార్మికులు ఆటంకాలు కల్గించడానికి అవకాశాలు దక్కాయి. ఆ విధంగా విచక్షణా రహితంగా ప్రజలను కొట్టడం, చావుకు కారణమయ్యే ఘటనలు జరిగే పరిస్థితి పెరిగింది. కొంతమంది వ్యక్తుల నేరాలు మరణశిక్ష విధించతగినవి కాకున్నా, వారు చంపబడ్డారు. వీటి పట్ల మనం తీవ్రమైన శ్రద్ధ పెట్టాలి.

ప్రజల్ని విచక్షణా రహితంగా చంపడాన్ని మనం వ్యతిరేకిస్తాం, అయితే దీనర్థం ఉరిశిక్షలు ఉండకూడదనికాదు. విప్లవ ప్రతీఘాత శక్తుల నాయకులు, నిరంకుశులు, ప్రజా పీడక శక్తుల నాయకుల నేరాలు వాస్తవంగా తీవ్రంగా పెద్దవిగా ఉన్న వాటికి సంబంధించి, వారికి ఉరిశిక్ష విధించమని ప్రజలందరూ కోరినపుడు, ప్రజాకోర్టులు దానిని ఆమోదించినపుడు (కౌంటీ–ఉపప్రాంత, లేదా అంతకన్నా పై స్థాయి ప్రభుత్వ కమిటీలు) వారు శిక్షించబడతారు. వారి నేరాలు ప్రచురింపబడాలి (రహస్యంగా ఎవరినీ శిక్షించకూడదు). నిర్హేతుకంగా నేరారోపణ చేయబడి ఎవరూ శిక్షింపబడకూడదు. యుద్ధంలో, కాల్పులలో ఎక్కువ మంది శత్రువులను చంపడమనేది తప్పించలేము. నిర్హేతుకంగా పొరపాటుగా చంపడం అనేది సమస్యలను పరిష్కరించలేదు, అంతేకాకుండా సమస్యకి పరిష్కారం లేకుండా చేస్తుంది. మరియు తాత్కాలికంగా విప్లవంలో ఓటమికి దారి తీస్తుంది కూడా. ఎందుకంటే, ప్రజా రాశుల సానుభూతిని పోగొట్టుకొంటాము మరియు చాలా మంది ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొంటాము. చైనా గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు, ధనిక రైతులు సుమారు జనాభాలో 10 శాతము ఉన్నారు. వారి సంఖ్య మొత్తం సుమారుగా 30,000,000. భూస్వామ్య దోపిడి వ్యవస్థను సమగ్రంగా రద్దు చేసిన తరువాత, భూమిని, ఆస్థులను రైతులకు సమాన పంపకం చేయడంతో భూస్వాములు వారి జీవనం కోసం సొంత శ్రమమీద ఆధారపడ్డారు. సమాజ ప్రయోజనం కోసం, సమాజ సంపదను సృష్టించే శక్తులుగా వారు క్రమంగా మార్చబడ్డారు. యుద్ధానికి, లేదా వ్యవసాయ సంస్కరణలకు ఎటువంటి నష్టము చేయని చాలా మంది భూస్వాములను, ధనిక రైతులను అకారణంగా చంపితే, ప్రజారాశుల సానుభూతిని పోగొట్టు కోవటమే కాకుండా, మనకి మనం ఏకాకులం చేసుకుంటాం. ఇంకా దేశ శ్రమశక్తికి నష్టం జరుగుతుంది; దీంతో సమాజం ఉత్పత్తి చేసే సంపద తగ్గిపోతుంది.(వారికి శ్రమ శక్తి కొరత కనుక) చంపబడిన వ్యక్తి కుటుంబానికి జీవన ఉపాధి వుండదు. ఇది ఇంకా సమాజం మీద భారం పెంచుతుంది.

ప్రజల్ని కొట్టడాన్ని మేము కూడా వ్యతిరేకిస్తాము. ప్రజా ఉద్యమ క్రమంలో పీడకులను తీవ్రంగా ద్వేషిస్తారు. వాస్తవమైన సరియైన ప్రజారాశుల ఆవేశము పీడకులపైన చేయి చేసుకోవడానికి దారితీస్తుంది. కమ్యూనిస్టులు వారిని ఆపలేరు. ప్రజారాశుల సరియైన ఆవేశము పట్ల కమ్యూనిస్టులు సానుభూతి చూపాలి. లేకపోతే మనం ప్రజారాశుల నుండి వేరుపడి పోతాము. అయితే, కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర ప్రభుత్వంలో పనిచేసే సిబ్బంది యుద్ధరహిత పరిస్థితిలో ప్రజలకి వ్యతిరేకంగా భౌతిక దాడులను నిర్వహించ కూడదు.

ప్రజారాశులు (సమక్షంలో) హాజరైన పార్టీ సమావేశాలలో గ్రామీణ ప్రాంతాలలో తప్పుచేసిన పార్టీ క్యాడర్, సభ్యులకు పరీక్ష పెట్టడం చాలా మంచి పద్ధతి. అదే సమయంలో పరీక్ష చేయబడుతున్న క్యాడర్‌కు మనం వివరించా ల్సిందేంటంటే, వారు ముందుగా ప్రజల ఎదుట తప్పును అంగీకరించమని, మరియు చట్టం ప్రకారం ప్రభుత్వంచేత, బదులుగా నొప్పి కలిగించే శిక్షలుండవని హామీనివ్వాలి. పరీక్షా సమావేశంలో, పరీక్షదారుడు అతని వాదాన్ని వినిపించుకొనే పూర్తి హక్కు కలిగి ఉంటాడు. అతని వాదన వినిపించడానికి అవకాశం ఇవ్వకపోతే అప్రజాస్వామికమౌతుంది. గ్రామీణ ప్రాంతాలలో, నగరాలలో, సైన్యంలో పాఠశాలలో, ఏ పరీక్షా సమావేశంలోనైనా, ఏ పార్టీ క్యాడర్ సభ్యుడైనా, పరీక్షదారుడు తన వాదాన్ని చెప్పుకొనే హక్కు కలిగి వుంటాడు.

ఇవే కాకుండా, పరిశీలనలోవున్న పని చేస్తున్న ఏ సిబ్బందినైనా ఆఫీసు నుండి నేరుగా తొలగించే లేదా తొలగించమని సూచించే హక్కు ప్రజారాశులకు ఇవ్వబడింది. వారిలో హీనులకు సంబంధించి, వారి చర్యలు చట్టాన్ని అతిక్రమించి నపుడు, ప్రజా కోర్టు ముందు నేరారోపణ చేసే హక్కు ప్రజా రాశులకు ఉంటుంది. మనం ప్రజారాశులు ప్రజల్ని కొట్టకుండా చూస్తాము. అయితే ప్రజారాశులకు అటువంటి హక్కులను ఇవ్వకపోతే విమర్శించడానికి వారు సాహసించరు. పార్టీలోని వ్యక్తిగత శక్తులతో వ్యవహరించే టపుడు, వీలైనంత మేరకు నోటితో విమర్శించడం, కారణం చెప్పడం, ప్రజల్ని కొట్టడానికి అనుమతించకపోవడం అనే సూత్రాలను అవలంబించాలి. దీన్నినొక్కి చెప్పడం ఫలితంగా, ప్రజారాశులు విమర్శించడానికి సాహసిస్తాయి మరియు పరీక్షదారుడు వారి వాదాన్ని చెప్పుకొనే అవకాశం కలిగి వుంటాడు.

ooooo